
నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

8 | ఖమ్మం, సోమవారం 2 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM



వలసవాదుల దోపిడీపై గర్జించిన ఉద్యమ గుమ్మం

మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పని పోరాటం

ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి జిల్లా పోరుబిడ్డలు

'జై తెలంగాణ' నినాదంతో కదం తొక్కిన సబ్బండవర్ణాలు

కేసీఆర్ దీక్షతో స్వరాష్ట్ర సాకారం..

పులకించిన పురిటిగడ్డ

నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

# తెలంగాణ అవతరణంలో.. తొలికేక ఖమ్మం

సీమాంధ్ర పాలకుల వివక్షకు, వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిలా 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టింది. నిధులు, నీళ్లు, నియామకాల్లో వివక్షను తట్టుకోలేక 1969లోనే 'జై తెలంగాణ' అంటూ గర్జించింది. స్వరాష్ట్రం, స్వపరిపాలన కోరుతూ ప్రత్యేక రాష్ట్రం నినాదానికి పురుడుపోసింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎందరో ముద్దుబిడ్డలు రక్త తర్పణం చేశారు. వీరుల త్యాగాలను పుణికిపుచ్చుకున్న పురిటిగడ్డ పోరుబిడ్డలు.. మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పలేదు. విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ఉద్యమ పార్టీల నేతలు, కార్యకర్తలు నాటి పోలీసుల నిర్బంధాలను లెక్కచేయలేదు. ఉద్యోగులు కూడా సీమాంధ్ర పాలకుల బెదిరింపులను పక్కన పెట్టి.. భావితరాల కోసం జీవితాలనే (కొలువులనే) పణంగా పెట్టి అలుపెరగని ఉద్యమాలు చేశారు. ఉద్యమ సారథి కేసీఆర్ కూడా ఆమరణ దీక్షకు పూనుకున్నారు. తెలంగాణలోని సబ్బండ వర్గాలూ ఆయనకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా చివరకు పార్లమెంటు సాక్షిగా తెలంగాణ బిల్లు ఆమోద ముద్ర వేసుకుంది. 2014 జూన్ 2న స్వేచ్ఛావాయువులతో స్వరాష్ట్రం అవతరించింది. పోరాటాల పురిటిగడ్డ పులకించిపోయింది.



### తెలంగాణ తొలికేక ఖమ్మానిదే..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వంతో విప్లవ భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న ఖమ్మం బిడ్డలు.. ఉద్యోగాల్లో జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు జెండా ఎత్తారు. 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టారు. ప్రాంతీయ వివక్ష, ముల్కీ, నాన్‌ముల్కీ అంశంపై 1969 జనవరి 8న తెలంగాణ ముద్దుబిడ్డ అన్నాబత్తుల రవీంద్రనాథ్ ప్రత్యేక నినాదంతో జెండాను భుజానికెత్తుకున్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లో అత్యంత ప్రజాస్వామ్య పద్ధతిలో ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఖమ్మానికే చెందిన సింగరేణి ఉద్యోగి కొలిశెట్టి రాందాసు, కైలాస్‌నాథ్, నిమ్మల శంకర్‌రావు, కవిరాజమూర్తి, కోలాహలం వెంకటేశ్వరరావు, వీ రామస్వామి, అర్వపల్లి సుధాకర్, అర్వపల్లి విద్యాసాగర్ లాంటి సహచరులు వెన్నంటి ప్రోత్సహించగా అన్నాబత్తుల రవీంద్రనాథ్ ఒక్కరే.. జనవరి 8 నుంచి 22 వరకు దీక్షను కొనసాగించారు. ఆ పోరాటమే మహత్తర తెలంగాణ ఉద్యమ సంగ్రామానికి నాంది పలికింది.

### మలిదశ ఉద్యమానికీ పురుడు పోసినం..

నివురుగప్పిన నిప్పులా ఉన్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన తొవ్వలో తెలంగాణ రాష్ట్ర సమితి (ఇప్పుడు బీఆర్‌ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షను భుజానికెత్తుకున్నారు. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగారు. దీంతో గడగడలాడిన సీమాంధ్ర పాలకులు కేసీఆర్‌ను అదేరోజు అరెస్టు చేశారు. ఖమ్మంలో సమైక్యవాదం ఎక్కువగా ఉంటుందని, తెలంగాణ ఉద్యమంగా అంతగా ఉండదని భావించిన సీమాంధ్ర పాలకులు ఆయనను ఇక్కడికి తీసుకొచ్చారు. తద్వారా తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కవచ్చని భావించారు. కానీ వారి భావన తప్పయింది. ఉద్యమసారథిని అరెస్టుచేసి ఖమ్మానికి తీసుకొస్తున్నారన్న విషయం తెలియగానే.. తెలంగాణ శక్తులన్నీ ఏకమయ్యాయి. ఆయనకు అండదండగా నిలిచి తెలంగాణ కాంక్షను చాటిచెప్పాయి.



### గుబాళించిన 'గులాబీ' దండు

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసమే పురుడుపోసుకున్న టీఆర్‌ఎస్ (ఇప్పుడు బీఆర్‌ఎస్).. ఖమ్మం పురిటిగడ్డపై అలుపెరగని పోరాటం చేసింది. సొంతంగా చెప్పుకోదగ్గ బలం లేకున్నా ప్రజల మద్దతును కూడగట్టి రాష్ట్ర సాధనలో తనదైన రీతిలో కొట్లాడింది. తెలంగాణ వాదానికి మద్దతు కూడగట్టింది. అడుగడుగునా సీమాంధ్ర నేతల విగ్రహాలున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాలను నెలకొల్పింది. ఉద్యమ గుమ్మాన తెలంగాణ సంప్రదాయ పండుగైన బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది.

### పులకించిన పురిటిగడ్డ..

రక్త తర్పణాలు, అక్రమ నిర్బంధాలు, అలుపెరుగని పోరాటాల ఫలితంగా 60 ఏళ్ల అనంతరం నాలుగున్నకోట్ల మంది తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమమైంది. ఫలితంగా 2014 జూన్ 2న పోరాటాల పురిటిగడ్డ పులకించి పోయింది. దేశ రాజధాని సాక్షిగా దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది. తల్లి తెలంగాణను తలుచుకొని సబ్బండ వర్ణాలూ ఆనంద భాష్పాలు రాల్చాయి. స్వేచ్ఛా వాయువులను పీల్చాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఒకరినొకరు గుండెలకు హత్తుకొని 'జయహో తెలంగాణ' అంటూ సెల్యూట్ చేశారు. నాటి నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఏటా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. కానీ కాంగ్రెస్ పాలనా పగ్గాలు చేపట్టిన ఈ ఏడాదిన్నరలో రెండు సార్లు తెలంగాణ అవతరణ దినోత్సవాలు జరిగాయి. అయినప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రజలు స్వచ్ఛమైన ఉద్యమ మాధుర్యాన్ని తనివితీరా అనుభూతి చెందలేకపోతున్నారు.

'మా నిధులు మాకే.. మా ఉద్యోగాలు మాకే..' అనే నినాదంతో తెలంగాణ ఆకాంక్ష తొలికేకను ప్రతిధ్వనించింది ఉమ్మడి ఖమ్మం జిల్లా. వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా గొంతెత్తి గర్జించింది. సీమాంధ్ర పాలకవర్గాల ప్రాంతీయ వివక్షపై పిడికెళ్లెత్తింది. నాలుగున్నర కోట్ల ఆకాంక్షకు పురుడు పోసింది. తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో మడమతిప్పని పోరాట పటిమను ప్రదర్శించింది ఉద్యమ ఖిల్లా. అమరుల త్యాగాలను గుండెలకత్తుకున్న ఖమ్మం మెట్టు.. స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని పోరు చేసింది. తెలంగాణ ఉద్యమ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచింది. – ఖమ్మం, జూన్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## ఇది తెలంగాణ ప్రజలకు పర్వదినం

### తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు: వద్దిరాజు, నామా





ఖమ్మం, జూన్ 1: రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవం ఒక పర్వదినమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వారు వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అవతరణ దినోత్సవమంటే కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే రోజని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకునే రోజని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఉద్యమ సంకల్పాన్ని నిలబెట్టే స్ఫూర్తిదాయక రోజుగా ప్రతి ఒక్కరూ దీనిని జరుపుకుందామంటూ ఉమ్మడి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు

కొత్తగూడెం టౌన్, జూన్ 1:రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కలెక్టరేట్లను అధికారులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. అవతరణ వేడుకల కోసం ఖమ్మం పరేడ్ గ్రౌండ్ కూడా ముస్తాబైంది.



విద్యుత్ దీప కాంతులతో వెలుగులీనుతున్న భద్రాద్రి కలెక్టరేట్

# సర్కారుకు నై.. ప్రైవేటుకు సై..

- ప్రభుత్వ కాలేజీలకు తగ్గుతున్న ఆదరణ
- సౌకర్యాలు ఉన్నా.. సంక్షేమ కాలేజీలు ఉన్నా విముఖత
- ఇంటింటి ప్రచారంలో పోటీ పడుతున్న యాజమాన్యాలు
- తల్లిదండ్రులను ఒప్పించడంలో సర్కార్ విఫలం.. ప్రైవేట్ సఫలం
- ఈ సారైనా కాలేజీల్లో సీట్లు భర్తీ అయ్యేనా?
- నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం

*ఇంజినీరింగ్ చదవాలన్నా.. మెడిసిన్ చేయాలన్నా ఇంటర్మీడియట్ విద్యనే విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది. ఇప్పుడు ఆ ఇంటర్ చదివే విద్యార్థులు సర్కారు కాలేజీలకు నో చెప్పి ప్రైవేటుకు సై అంటున్నారు. మరి తప్పెవరిది అంటే సర్కారుదేననే సమాధానం వస్తున్నది. కార్పొరేట్ స్థాయిలో వసతి సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ చదువులకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ప్రతియేటా సర్కారు కాలేజీల్లో విద్యార్థుల నమోదుశాతం తగ్గుతూనే ఉంది. అయినా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం వల్ల విద్యారంగం నీరుగారిపోతున్నది. విద్యార్థి సంఘాలు గొంతెత్తి మొత్తుకున్నా రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడం లేదు.*

*– భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1 (నమస్తే తెలంగాణ)*





విద్యార్థికి అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కాలేజీలు 14 ఉన్నాయి. వీటితో పాటు సంక్షేమ హాస్టళ్లతో కూడిన కాలేజీలు 56 ఉన్నాయి. అయినా ఇందులో ఉండాల్సిన 4,006 మంది విద్యార్థులకు గాను గత ఏడాది 2,900 మంది మాత్రమే ప్రభుత్వ కాలేజీల్లో చేరినట్లు లెక్కలు చెబుతున్నాయి. మరి ప్రైవేటు కాలేజీలు జిల్లాలో 30 ఉన్నా అందులో 5,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రూప్ ఏదైనా కాలేజీ ముఖ్యమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు కాలేజీలకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కాలేజీలు ఆయా గ్రామాలకు దూరంగా ఉండటంతో పాటు రవాణా సౌకర్యాలు లేకపోవడం ఆర్టీసీ బస్సు వస్తేనే తప్ప మండల కేంద్రాలకు చేరుకునే పరిస్థితి లేదు. కాలేజీ విద్యార్థులకు ప్రత్యేక బస్సులు లేకపోవడం కూడా విద్యార్థుల సంఖ్య ప్రభుత్వకాలేజీల్లో తగ్గడానికి కారణమనే చెప్పాలి. ఇదేకాక కాలేజీల దగ్గర్లో ఉన్న కాలేజ్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌లో సరైన వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు సర్కారు కాలేజీలపై ఆసక్తి చూపడం లేదు.

### ఇంటింటి ప్రచారంలో పోటీ..

'మా కాలేజీలోనే చదవండి' అని ప్రభుత్వ అధ్యాపకులు, ప్రైవేటు యాజమాన్యాలు ఇంటింటి ప్రచారాల్లో పోటీ పడుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు ప్రత్యేక సిబ్బందిని పెట్టి విద్యార్థి ఇంటికి వెళ్లి అవసరమైతే వాళ్ల బంధువులు,స్నేహితులతో మాట్లాడించి విద్యార్థిని ఒప్పించడంలో సఫలమవుతున్నారు. ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులు కేవలం విద్యార్థుల ఇంటికెళ్లి అవగాహన కల్పిస్తున్నారు కానీ తల్లిదండ్రులను ఒప్పించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. గత నెలరోజుల నుంచి కాలేజీ నిర్వాహకులు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే చాలామందిని ప్రైవేటు కాలేజీల్లో చేర్పించేశారు. బీటెక్ చదవాలంటే ఇంటర్‌లోనే మంచి మార్కులు రావాలని అవగాహన కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు బయట కాలేజీల్లో చదివించడానికి ఆసక్తి చూపుతున్నారు.

### ఈ సారైనా సీట్లు భర్తీ అయ్యేనా?

ప్రభుత్వ కాలేజీల్లో ఎలాంటి ఫీజులు లేవు. కేవలం పరీక్ష ఫీజు రూ.520 చెల్లిస్తే చాలు. 12నెలల స్కాలర్‌షిప్ కూడా వచ్చేస్తుంది. టెస్టు పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నారు. అయినా సీట్లు భర్తీ కావడంలో ఏడాదికేడాది వెనుక వరుసలోనే ఉంటున్నారు. ఈసారి పూర్తిస్థాయిలోఅధ్యాపకులను కూడా ప్రభుత్వం భర్తీచేసి పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నది. మొత్తం కాలేజీల్లో 160మంది అధ్యాపకులు ఉన్నారు. 11మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న 23మంది అధ్యాపకులను ఇటీవల ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 27మంది గెస్టు లెక్చరర్లను కూడా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో సర్కారు కాలేజీల్లో అధ్యాపకులు పోస్టులు ఎక్కడా ఖాళీలేవనే చెప్పాలి. అయినా సీట్లు భర్తీ అవుతాయా లేదా అనేది ప్రశ్నార్థకం.

### గురుకులాలు వచ్చాక సీట్లు భర్తీకావడం లేదు..



వసతి సౌకర్యాలు కోసం ప్రభుత్వం గురుకులాలను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు భర్తీ కావడం లేదు. తీరా అక్కడ కూడా సరైన సౌకర్యాలు కల్పించలేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చేరుతున్నారు. తల్లిదండ్రులను ఒప్పించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేయాలి. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలి.

– కే.పృథ్వీ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, స్టూడెంట్స్ యూనియన్

### పోటీ పరీక్షల్లో రాణించాలంటే ప్రైవేట్ తప్పదు..



మా అబ్బాయి 2024లో పదో తరగతి ప్రభుత్వ స్కూల్‌లోనే చదివాడు. టాపరు కూడా. ప్రభుత్వ కాలేజీలో చదివించాలి అనుకున్నా. కానీ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే మంచి ఫ్యాకల్టీ ఉండాలని ప్రైవేట్‌లోనే చదివించాను. మండల హెడ్ క్వార్టర్‌లో కాలేజీ ఉంది.. చాలామంది దూరప్రాంతాల రాలేక హాస్టల్స్‌లో ఉంటున్నారు.

– దల్లి సతీష్‌రెడ్డి, దుమ్ముగూడెం మండలం

### హాస్టల్ లో ఉంచడానికి ఇష్టపడుతున్నారు



ప్రైవేటు కాలేజీల్లో హాస్టల్ సౌకర్యం ఉండటం వల్ల తల్లిదండ్రులు అక్కడ ఉంచడానికి ఇష్టపడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు హాస్టల్‌లో ఉండి చదువుకుంటే క్రమశిక్షణతోపాటు సమయం ఆదా అయ్యి చదువుపై ఇంట్రెస్ట్ పెరుగుతుందని తల్లిదండ్రులు ప్రైవేటు వైపు వెళ్తున్నారు. కానీ పేద విద్యార్థులు చాలా నష్టపోతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో కూడా చాలా సౌకర్యాలు ఉన్నాయి. కాలేజీ మేనేజ్‌మెంట్ హాస్టల్ ఉంది. ఎలాంటి ఫీజులు ఉండవు. అధ్యాపకులు కూడా పూర్తిస్థాయిలో ఉన్నారు. ఆడపిల్లలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది. తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే పిల్లల భవిష్యత్ బాగుపడుతుంది.

–వెంకటేశ్వరరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి

## స్థానిక సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో.. 'పేట' ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దమ్మపేట, జూన్ 1: స్థానిక సమస్యల పరిష్కారం కోసం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఇంటిని సీపీఐ నేతలు ఆదివారం ముట్టడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన గండుగులపల్లిలోని జారే ఇంటిని సీపీఐ నాయకులు, నిరుపేదలు ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి సమీపంలోని మల్లారం గ్రామ శివారులో సుమారు 120 కుటుంబాలకు చెందిన నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన జారే.. ఆ నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని, విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తారని ఆశించామని అన్నారు. ఏడాదిన్నర దాటినా తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో తాము ఇప్పటికీ అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జారే.. ఆందోళనకారులను లోపలికి పిలిచి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. దీంతో ఎమ్మెల్యేకు నాయకులు, నిరుపేదలు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. రెండు మూడు రోజుల్లో అధికారులను విచారణకు పంపిస్తామని అన్నారు. సీపీఐ నాయకులు, నిరుపేదలు పాల్గొన్నారు.

## ప్రతి అడుగు పచ్చదనం కోసమే..

- సింగరేణి సీఎండీ బలరాం
- కొత్తగూడెం ఏరియాలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న సీఎండీ బలరాం

రామవరం, జూన్ 1: ప్రతి ఆఫీస్, డిపార్ట్‌మెంట్లలోని ఖాళీ ప్రదేశాల్లో 'ప్రతి అడుగు పచ్చదనం కోసమే..' అనే నినాదంతో మొక్కలు నాటాలని సింగరేణి అధికారులను సంస్థ సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. ఆదివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేవోసీ యార్డులో 'వన మహోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎండీ మాట్లాడుతూ మొక్కలు నాటడం అంటే దేవుడికి సేవ చేసినట్లే అన్నారు. ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని, అది పెరిగి పెద్దదై రూ.కోట్ల విలువచేసే ఆక్సిజన్‌ను ఇస్తుందని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. భవిష్యత్‌తరాల కోసం మొక్కలను నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు తాను 19వేల మొక్కలను నాటానని, ఈ ఏడాది మరో 2వేల మొక్కలు నాటడంలో భాగంగా ఈరోజు జీకేవోసీలో 200 మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్మికప్రాంతాల్లో ఉండే క్వార్టర్లలో పండ్ల మొక్కలను పెంచేవిధంగా వారిని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, ప్రజాప్రతినిధులు ఎవరైనా మొక్కలు అడిగితే అందించాలని ఎన్విరాన్‌మెంటల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, ఫారెస్ట్రీ అండ్ అడ్వైజర్ మోహన్ చంద్ర పర్గిన్, ఏరియా జీఎం శాలెంరాజు, జీఎం ఎన్విరాన్‌మెంట్ సైదులు, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీరమేష్, ఏరియా ఇంజినీర్ సూర్యనారాయణరాజు, ఏరియా అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి గట్టయ్య, ఏఐఎన్‌టీయూసీ నుంచి ఎండీ రజాక్, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎంవీ నరసింహారావు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణ, హనా సుమలత, డీజీఎం శివకేశవరావు, యోహాన్, సత్యనారాయణ, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజూ కొనసాగిన నిరసన

### డీఐఈవోకి వినతిపత్రం అందజేసిన అధ్యాపకులు



డీఐఈవోకి వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఖమ్మం అర్బన్, జూన్ 1: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకుల రెండో వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఆదివారం నిరసనలు కొనసాగాయి. ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు, నల్లచొక్కాలతో రెండోరోజు తమ నిరసనను తెలిపారు. టీజీజేఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సమస్యను తెలియజేయలేకపోతున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి అధ్యాపకుల ఇంక్రిమెంట్లను చేయాలన్నారు. అనంతరం డీఐఈవో, క్యాంపు ఆఫీసర్ రవిబాబుకి అధ్యాపకులందరూ కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమని జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, షహీనాభేగం, అల్లు విజయ్, కిషోర్, జాన్, శ్రీకాంత్, వరలక్ష్మి, జ్యోత్స్న, నరసింహారావు, కట్టా రవీంద్రబాబు, గంటా కృష్ణ, పుల్లారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.